# కిలుం

ఇరవై ఏళ్ళ క్రితం భర్తతో కలిసి అమెరికా వెళ్ళిపోయిన విమల వస్తోందనగానే కమల మనసు ఆనందంతో, బెంగతో గుబగుబలాడిపోయింది. కమల–విమల కవల పిల్లలు. కమల కంటే విమల ఒక క్షణకాలం చిన్నది. అది ఆధారం చేసుకుని విమల మీద ఎప్పుడూ అక్కగా పెత్తనం చెలాయిస్తూండేది. సాత్విక స్వభావం గల విమల అక్క చెప్పినట్టే వినేది. ఇద్దరూ ఒకే పోలికలో వున్నా, మాటా, నడక, కదలికా అన్నీ నొకేలాగ ఉన్నా కమల కంటే విమల నాజూకుగా, సుకుమారంగా ఉంటుందని అందరూ అనేవారు.

అప్పుడప్పుడు కాస్త అసూయ పడినా అందమైన, ముద్దుల చెల్లెల్ని చూసి కమల ఎప్పుడూ మురిసిపోతూనే ఉండేది.

రాజా అమెరికా నుండి పెళ్ళి కుమార్తెల వేటలో ఇండియా వచ్చినప్పుడు కమల విమలల తండ్రి అతన్ని ఇంటికి ఆహ్వానించాడు – అందరూ వూహించినట్లుగానే అతను విమలనైతే చేసుకుంటానన్నాడు. అప్పట్లో పెళ్ళి చేసుకోవాలని లేని కమల ఊపిరి పీల్చుకుంది.

అప్పుడు అమెరికా వెళ్ళిన విమల మళ్ళీ ఇండియా రాలేకపోయింది. తండ్రి పోయినా, తల్లిపోయినా ఫోనులో గొల్లుమని ఏడ్చిందేగాని బయలుదేరి రాలేకపోయింది. విమల రాసిన ఉత్తరం ద్వారా కమల చెల్లెలి జీవిత చిత్రాన్ని చూడగలిగింది. రాజా ఆమెకి తగిన వరుడు కాదనీ, ఆమెనెంతో హింసించి, బాధించి, మరొకామెని పెళ్ళి చేసుకునే పరిస్థితుల్లో విడాకులు పొంది, విమలకి తీరని ద్రోహం చేశాడని

గ్రహించుకుంది. కమల అప్పట్లో ఇండియా వచ్చేయమని చెల్లెలికి ఎన్నో ఉత్తరాలు రాసింది. కాని ఏవేవో సమాధానాలు రాస్తూ విమల ఈనాటి వరకు స్వదేశం వచ్చే కార్యక్రమం వాయిదా వేస్తూ వచ్చింది.

❖ ❖ ❖

ఎయిర్‌పోర్టులో చెల్లెల్ని చూసి కమల కళ్ళ నీళ్లు ఆపుకోలేకపోయింది. అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసినట్లుండే విమల ఇప్పుడలా లేదు. ఆ కళ్ళూ, ముక్కూ, బుగ్గలూ చూస్తుంటే పదేళ్ళ క్రితం చనిపోయిన తన మూడో అక్కయ్య గుర్తుకొచ్చింది.

విమలకి బాగా వొళ్ళు వచ్చింది. బుగ్గలు పెరిగి, కళ్లు మూసుకున్నాయి. రంగు మాత్రం బాగానే ఉంది - చెంపల దగ్గర నెరసిన జుట్టు చూసి కమల దిగాలు పడిపోయింది.

అక్కయ్యని కౌగలించుకుని నిశ్శబ్దంగా కాస్సేపు ఏడ్చేసింది విమల.

ఇంటికొస్తూనే కబుర్లలో పడ్డారు. విమల మాటల్లో, వేషంలో చాలా మార్పు కనిపించింది కమలకి. తన శరీరం మీద, బట్టలు కట్టుకునే తీరులో అశ్రద్ధ కొట్టొచ్చినట్టు కనబడింది.

ఇల్లంతా వందసార్లు అటూ యిటూ తిరిగింది విమల. అప్పుడు మొదటిసారి చూస్తున్న కమల భర్తలో ఎంతో హుందాతనం కనిపించింది విమలకి.

పెరట్లో ముద్దమందార చెట్టు, నందివర్ధనం పూలు, ఎర్రని నూరు వరహాల గుత్తులూ చూస్తూ మురిసిపోయింది. వంటింటి తలుపు తీయగానే ఎదురైన తులసి కోటను ఒకసారి కౌగలించుకుని బావురుమంది.

"ఏమిటే విమలా ఈ పిచ్చి?" అంటూ ఓదార్చబోయిన కమలకి -

'అమ్మని చూసినట్లుందీ తులసి కోటను చూస్తే' అన్న మాటలు గుండెల్లో దుఃఖాన్ని సుళ్ళు తిప్పాయి. కమలకి కూడా తల్లి గుర్తుకొచ్చి వలవలా ఏడ్చింది.

"అమ్మ ఆఖరు ప్రాణం పోయేటప్పుడు కూడా నీకోసమే వెదికింది".

ఆ రోజంతా ఇద్దరూ, దిగులుగా, ప్రేమగా, కొంతసేపు ఆనందంగా, మళ్ళీ అంతలోనే విచారంగా గడిపేశారు.

❖ ❖ ❖

కాలేజీ నుండి యింటికొచ్చేసరికి కమలకి ఇల్లంతా శుభ్రంగా సర్ది కనిపించింది. స్టోర్ రూంలో దేవుడి మందిరానికి ఉద్దేశించిన చోట శుభ్రంగా కడిగి, ముగ్గు వేసి

ఉంది. అక్కడున్న దేవుడి పటాలన్నీ తడిగుడ్డతో తుడిచి అందంగా అమర్చబడి ఉన్నాయి. విష్ణు సహస్రనామాలు, భజగోవింద శ్లోకాలు, లక్ష్మీస్తోత్రం - పుస్తకాలు అమరికగా అక్కడ పెట్టి వున్నాయి.

కమలేదో మాట్లాడబోయేంతలో "ఏమే అక్కా! పూజా, పునస్కారం, దేవుడూ, భక్తీ లాంటివేమీ లేవా" అంటూ నిలేసింది విమల.

కమల నవ్వేసింది. 'ఈ పటాల ముందు కూర్చుని రామ రామంటూ జపం చేసుకుంటూ కూర్చోడానికి నాకు తీరికా లేదు, నమ్మకమూ లేదు' అంది.

విమల ముఖం గంభీరంగా మారిపోయింది. కమల లోపలికెళ్ళి ముఖం కడుక్కుని రెండు కప్పుల్లో కాఫీ పోసి తీసుకొచ్చి చెల్లెలి కెదురుగా కూర్చుని, ఒక కప్పు అందిస్తూ, ఆమె ముఖం చూసి గతుక్కుమంది.

"ఏమైందీ?" అంది

"ఏమీ కాలేదు. జీవితంలో దెబ్బ తిన్నప్పుడే కొన్ని విషయాలు అర్థమవుతాయి"

"అంటే?"

"రాజాతో నేను దేశం కాని దేశంలో, మనుషులు కాని మనుషుల మధ్య నరకం అనుభవించే సమయంలో నన్నీ దేవుళ్ళే రక్షించారు. విష్ణు సహస్రాలే ధైర్యాన్నిచ్చింది" అంది విమల.

"అదంతా నీ భ్రమ- నీకు మనుషులెవ్వరూ సాయం చేయలేదా?"

"చేశారు, భౌతికంగా చేయూతనిచ్చి, ఆశ్రయం యిచ్చి ఆదుకున్నారు. కానీ మానసికంగా నేను కృంగిపోకుండా నన్ను ఈ దేవుళ్ళే, నా యీ భారతీయ సంస్కృతే రక్షించింది".

కమల ఆశ్చర్యంగా చెల్లెలి వైపు చూస్తూండిపోయింది. కమలకి అస్సలు భక్తి లేదు. ఆమె మొదటి నుండీ పూజలూ, పారాయణలు చేయడంలో నమ్మకం లేని మనిషి. అవన్నీ మానసిక దౌర్బల్యానికి చిహ్నాలని గట్టిగా నమ్మేవ్యక్తి. కానీ... ఈ రోజు తన చెల్లెలు అమెరికాలాంటి అగ్రదేశంలో ఇరవై ఏళ్ళు వుండి వచ్చి మంచి గైనకాలజిస్టుగా నిపుణత సంపాదించి - ఇలా మాట్లాడడం ఆమెకెంతో విస్మయంగా వుంది.

ఇలాంటి మతపరమైన మత్తులో పడి, భజనలు చేస్తూ వుండిపోవడం వల్లే, దుర్మార్గుడైన రాజాని వాడి మానాన వాడ్ని వదిలేసింది. అదే తనైతే ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించేది.

కమల ఇదే విషయాన్ని గట్టిగా విమలకి చెప్పింది కానీ ఆమె తేలిగ్గా తీసి పారేసింది.

'నీకు అర్థం కాని విషయాలు చాలా వున్నాయి' అంది సాలోచనగా.

"ఏమిటో కొన్ని చెప్పు"

"ఆడదాన్ని నలభై ఏళ్ళు వచ్చేవరకు శృంగారానికి పనికొచ్చే ఒక వస్తువుగా బాధించటమే కాక, ఆ తర్వాత ఆమె పెట్టే బంగారు గుడ్డు కోసం కాపువాడిలా, సంఘంలో ప్రతి మగాడు కాపు వేస్తాడు. కనీసం ఆ సంస్కృతి మన భారతదేశంలో లేదనుకుంటున్నాను. వయసు మళ్ళిన కొద్దీ, డబ్బు సంపాదిస్తున్న కొద్దీ, అక్కడసలు రక్షణ లేదనిపిస్తుంది – అలాంటి నైతికమైన ఆలోచనకి మన సంస్కృతి, మన మతం, మన ఆచారాలు సహకరిస్తాయని నేననుకుంటున్నాను" అంది విమల.

కమల నోరెళ్ళబెట్టి చూస్తూండిపోయింది. అమెరికాలో స్త్రీ సంపూర్ణ స్వేచ్ఛ అనుభవిస్తోందనీ, విడాకులు సులభంగా పొందుతోందనీ, పునర్వివాహం సులువుగా చేసుకోగలుగుతోందనీ, అనుకుంటే మరి ఇవన్నీ ఏమిటీ... అసలు సంస్కృతి అంటే ఏమిటి? ఆమె ఆలోచనలు ఆపి "నిన్ను అన్ని బాధలు పెట్టిన రాజా ఈ సంస్కృతిలోంచి వచ్చినవాడేనని మర్చిపోతున్నావా?" అంది కసిగా.

"లేదు, ఎప్పుడూ మర్చిపోను, కానీ మగవాడు అనే మృగం, జాతి, మత, దేశ, కాలాలకి అతీతమని నాకు బాగా తెలుసు. కానీ నేను నేనుగా నిలద్రొక్కుకోడానికి నాకు దేవుఁడు అనే ఊహ ఆసరా అయింది. నాకు దేవుఁడున్నాడు" అంది.

"నాకు లేదు. నాకీ మతం పేరు చెప్పి చేసే గారడీ అంటే అసహ్యం. రక్తమాంసాలతో వున్న మనిషిలో లేనిదేదో, రాతి బొమ్మలో వుందంటే నేను నమ్మను" ఖచ్చితంగా చెప్పింది.

"మరీ మంచిది, నమ్మకం అనేది ఎవరిది వారిదే, అనుసరణకి కుదిరేది కాదు"

"మతం పేరుతో ఎంత వ్యాపారం, ఎంత అత్యాచారం జరుగుతోందో తెలుసా?"

"దాన్ని నేను సమర్థించను. కానీ మానవత్వం పేరుతో కూడా అంతకంటే తక్కువేం జరగటం లేదు". కమల ఉలిక్కిపడింది.

ఖాళీ అయిన కాఫీ కప్పులు తీసుకుని లోపలికెళ్ళింది కమల – అప్పుడు చూసింది ఎప్పుడో తను అత్తారింటికీ వస్తుంటే అమ్మ యిచ్చిన ఇత్తడి నీళ్ళ కాగులో చింతపండు నీళ్ళలో దేవుఁడి విగ్రహాలను – పంచలోహ విగ్రహాలు – విష్ణుమూర్తి, లక్ష్మీదేవి,

శివుడు, పార్వతి, విఘ్నేశ్వరుడు, సరస్వతి, ఆంజనేయస్వామి... చల్లని నీళ్ళలో విగ్రహాలు తలొకదిక్కుగా....

"ఇదేమిటే విమలా?" అంది.

"బాగా కిలుం పట్టేశాయి. దేవుళ్ళని తోమాలి" అంది విమల.

కమల మనసు విచిత్రంగా స్పందించింది. నెమ్మదిగా తన చేత్తో ఆ నీళ్ళని తాకింది. నల్లగా – మురికిగా – చల్లగా –

చెల్లాయి నమ్మిన దేవుంళ్ళు కిలుం పడితే చింతపండు పులుసులో నానబెట్టింది తోమడానికి –

తను నమ్మిన మనుషులకి పట్టిన కిలుం వదిలించాలంటే ఈ విశ్వమంత గంగాళంలో ఏమి వేసి తోమాలి? కమల ఆలోచనలు ఒక్కసారిగా గందరగోళమై పోయాయి. విమల వైపు చూస్తూండిపోయింది.

(ఆంధ్రప్రభ దినపత్రిక వారి దీపావళి ప్రత్యేక ప్రచురణ, 10.11.1996)